అభివృద్ధిలో ఆదర్శం.. పెర్నపాడు గ్రామం


పెర్నపాడు గ్రామంలో నిర్మించిన గోడౌన్


నూతనంగా నిర్మించిన శ్రీరామాలయం


పెర్నపాడు - గోటూరు గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు

- 50 ఏళ్లుగా వివాదాలకు దూరంగా గ్రామస్తులు
- ఊరిలో రూ.6.50 కోట్లతో అభివృద్ధి పనులు
- ఈ నెల 17న ఎంపీ చేతుల మీదుగా ప్రారంభం

వేముల : అదొక చిన్న గ్రామం.. గ్రామంలో అందరూ వ్యవసాయదారులే.. వ్యవసాయమే జీవనాధారం. గ్రామంలో 104 కుటుంబాలు ఉన్నాయి. సుమారు 570 మంది జనాభా ఉన్నారు. అభివృద్ధిలోనూ ఆదర్శంగా నిలుస్తోంది.. మండలంలోని పెర్నపాడు గ్రామం. ఈ గ్రామం గతంలో గొల్లల గూడూరు పంచాయతీ పరిధిలో ఉండేది. 2020లో పెర్నపాడు ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింది. అప్పటి నుంచి అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. పాడా నిధులతో గ్రామానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు.

గ్రామం నుంచే మొట్టమొదటి ఎంపీపీ ఎన్నిక

గ్రామంలో మండల ప్రజా పరిషత్ వ్యవస్థ ఏర్పడ్డాక గ్రామం నుంచి మొట్టమొదటి ఎంపీపీ ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన నాగేళ్ల అంకిరెడ్డి 1987లో వేముల ఎంపీపీగా ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నికయ్యారు. అలాగే గ్రామానికి చెందిన మండల ఇన్‌చార్జి సతీమణి నాగేళ్ల సత్యప్రభావతమ్మ 2006 వేముల జెడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం నాగేళ్ల సాంబశివారెడ్డి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

50 ఏళ్లుగా వివాదాలకు దూరంగా గ్రామస్తులు

గత 50 ఏళ్లుగా వివాదాలకు దూరంగా ఉంటున్నారు పెర్నపాడు గ్రామస్తులు. ఇప్పటి వరకు గ్రామానికి చెందిన వారిపై వేముల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలో చిన్న, చిన్న సమస్యలు వచ్చినా స్థానిక పెద్దతో సామరస్యంగా పరిష్కరించుకుంటున్నారు. గ్రామంలో ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవడంలో ముందుంటారు. పార్టీలకతీతంగా అందరూ గ్రామంలో సహాయ సహకారాలు అందించడం ద్వారా అభివృద్ధికి మార్గం సుగమమైందని చెప్పవచ్చు.

రూ.6.50 కోట్లతో అభివృద్ధి పనులు

గ్రామంలో రూ.6.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలో ప్రజల సహకారంతో పాడా నిధులతో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపారు. గ్రామంలో కోటి రూపాయలతో గోడౌన్‌ను నిర్మించారు. అలాగే పెర్నపాడు - గోటూరు గ్రామాల మధ్య రూ.3 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో గ్రామాల మధ్య దూరం తగ్గి ప్రజలకు సౌకర్యం ఏర్పడింది. అలాగే రూ.50 లక్షలతో గ్రామంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. పంచాయతీ ఏర్పడ్డాక రూ.30 లక్షలతో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. అంతేకాక గ్రామస్తుల సహకారంతో రూ.1.50 కోట్లతో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు.

ఈనెల 17న ఎంపీ చేతుల మీదుగా ప్రారంభం

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ నెల 17వ తేదీన ప్రారంభిస్తారని మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తి కావడంతోపాటు సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభోత్సవాల అనంతరం విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొంటారన్నారు.

ప్రగతి పథం



మా గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామానికి అన్ని మౌలిక సదుపాయాలు సమకూరాయి. పాడా నిధులతో గ్రామం అభివృద్ధిలో ముందంజలో ఉంది. గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మించారు. విగ్రహ ప్రతిష్టకు ఘనంగా ఏర్పాట్లు చేశాం.

\- హరినాథరెడ్డి, గ్రామస్తుడు, పెర్నపాడు

గ్రామాన్ని అభివృద్ధి చేశాం



పెర్నపాడు గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాం. పాడా నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేసి పూర్తి చేశాం. అందరి సహకారంతో అభివృద్ధి సాధించాం. గ్రామాల మధ్య లింకు రోడ్లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశాం.

\- ఎ.లక్ష్మీకాంతమ్మ, సర్పంచ్, పెర్నపాడు

క్లుప్తంగా

ఘనంగా శ్రీ సీతారామ విగ్రహ ప్రతిష్ట

కొండాపురం : మండల పరిధిలోని బెడుదూరు గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ ధ్వజ శిఖర కలశ నూతన విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివార్ల దివ్యదర్శనం మంగళహారతి తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రొద్దుటూరు లింగాపురం గ్రామానికి చెందిన పెనుబడి పద్మావతి ఎద్దులు 2909 అడుగులు లాగి మొదటి బహుమతి రూ. 30 వేలు, అలాగే దువ్వూరు మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన సుదర్శన్ ఎద్దులు 2896 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ. 20 వేలు, అనంతపురం జిల్లా ప్యాపిలి మండలం గుడిపాడు ఓబులేసు ఎద్దులు 2890 అడుగులు లాగి తృతీయ బమమతి సాధించాయి.

9 ఎలక్ట్రికల్ ఆటోలు ప్రారంభం


ఎలక్ట్రికల్ ఆటోలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సౌజన్యంతో 9 ఎలక్ట్రికల్ ఆటోలు సరఫరా చేశారని మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రికల్ ఆటోలను ఆయన ప్రారంభించారు. ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి పొడి తడి చెత్త సేకరిస్తారన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోని చెత్తను ఆటోలలో వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చంద్రకళ, కమిషనర్ రామక్రిష్ణ, కౌన్సిలర్లు నాగిరెడ్డి, ఎరికల రెడ్డి, భాస్కర్, ప్రశాంత్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, ఆర్‌ఓ గంగిరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం చెరుకాంపల్లె గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్-3 ప్రోగ్రాం అధికారి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛ భారత్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రామాలయం తదితర ప్రాంతాలలో చెత్తా చెదారాన్ని తొలగించారు. అనంతరం పరిసరాలను శుభ్రత పాటించాలని.. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రాష్ట్ర డైరెక్టర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మహిళా కార్యకర్తలు, మహిళా సంఘాలు, యువజన విభాగాల వారు, మిగతా అనుబంధ సంఘాల వారందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : వేసవి కాలం ప్రారంభం కానుండటంతో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా దృష్టి సారించాలని ఎంపీపీ రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సురేంద్రనాథరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి మంచినీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా అందుబాటులో ఉన్న చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని, ఆయన సంకల్పానికి ప్రతి ఒక్కరూ చేయూతనందించి గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తొలగించిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

వేంపల్లె : వేంపల్లెలోని 5వ సచివాలయ పరిధిలో తొలగించిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని బిడాలమిట్టకు చెందిన పలువురు మహిళలు కోరారు. ఇటీవల జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు విధులలో నిర్లక్ష్యం వహించారని సచివాలయ పరిధిలోని వి.శివమ్మ, లావణ్య, ఆజాదీ, రాజేష్‌లను అధికారులు తొలగించారు. బుధవారం స్థానిక బిడాలమిట్టకు చెందిన పలువురు మహిళలు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వెళ్లగా అక్కడ ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడంతో సచివాలయం- 5లోకి వెళ్లి సచివాలయ కార్యదర్శిని కలిశారు. తొలగించిన వల్లెపు శివమ్మ అనే వలంటీర్‌ను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కరోనా సమయంలో కూడా వలంటీర్ శివమ్మ ప్రజలకు అందుబాటులో ఉండి పింఛన్లు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి పథక వివరాలను ప్రజలకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. అటువంటి వలంటీర్ శివమ్మను తొలగించడం అన్యాయమని మహిళలు సచివాలయ కార్యదర్శి రాఘవేంద్రకు తెలిపారు. వలంటీర్ల తొలగింపు తమ పరిధిలోని లేదని.. ఎంపీడీఓను కలవాలని సచివాలయ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు.

ప్రజా పోరాటాలకు బాసటగా నిలవండి

వేంపల్లె : ప్రజా సమస్యలే అజెండాగా, లక్ష్యంగా ప్రజా పోరాటాలు చేస్తున్న సీపీఐకి బాసటగా నిలవాలని ఆ పార్టీ పులివెందుల ప్రాంతీయ కార్యదర్శి వెంకట్రాములు పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో సీపీఐ నిధి సేకరణ కోసం ఆ పార్టీ నేతలు గడప గడపకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో పాలకులతో పోరాడటంలో సీపీఐ ముందుండి పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శులు బాషా, బ్రహ్మం పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించండి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని కడప రోడ్డులో సతీష్‌కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన అభిరుచి రెస్టారెంట్‌ను బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ అభిరుచి రెస్టారెంట్‌కు వచ్చే ప్రజలకు నాణ్యమైన ఆహారంతోపాటు పరిశుభ్రంగా ఉన్న ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వైఎస్ ప్రతాప్‌రెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డి, వాల్మీకి సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణ స్వామి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పనాథరెడ్డి, వేణుయాదవ్, రాజుల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు పార్నపల్లె కిశోర్, కోడి రమణ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


అభిరుచి రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెందులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దాలు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుట, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9963170177, 08568286189 అనే నంబర్లకు సంప్రదించాలన్నారు.

స్వచ్ఛ కమలాపురమే ఎమ్మెల్యే ఆశయం

కమలాపురం : స్వచ్ఛ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి లక్ష్యం అని మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ సాదిక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సొంత నిధులతో జేసీబీ సాయంతో తొలగించారు. కొన్ని గ్రామాల్లో రహదారుల వెంబడి కంపచెట్లు అడ్డంగా ఉన్నాయని ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, అన్ని గ్రామాల్లో రహదారులు, పొలాలకు వెళ్లే దారుల్లో మొలచి అడ్డంగా ఉన్న కంపచెట్లను తొలగిస్తున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే సొంత నిధులతో కంపచెట్లు తొలగించడం హర్షణీయం అన్నారు. స్వచ్ఛ కమలాపురం ఎమ్మెల్యే ఆశయం అన్నారు. అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ గ్రామాల్లో పొలాలకు వెళ్లే దారులో కంపచెట్లు తీయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మస్తానయ్య, గఫార్, సుదర్శన్ రెడ్డి, జిలానీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ కాలనీకు వెళ్లే రహదారిలో కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

వేంపల్లె : వేంపల్లెలోని ఆవోపా, ఆవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా స్థానిక స్వామి వివేకానంద ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవికి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే సరస్వతి స్తోత్రం, హయగ్రీవ స్తోత్రం తదితర శ్లోకాలను పలికించి అర్చకులచే వేద ఆశీర్వాదం చేయించారు. అనంతరం ఆవోపా మహిళా విభాగ కార్యవర్గ సభ్యులు, కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులకు సరస్వతిదేవి డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆవోపా ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్, ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు పి.ప్రవీణ, ఉపాధ్యక్షురాలు బి.నాగలక్ష్మి, సంధ్యారాణి, ఆవోపా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

కమలాపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు సమక్షంలో వసంత పంచమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి స్కూల్‌లో చిన్న పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అక్షరాభ్యాసం చేయించారు. వసంత పంచమి రోజున అక్షరాభ్యాసం చేస్తే చిన్నారులు ఉన్నత విద్యను అభ్యసిస్తారని వేద పండితులు పేర్కొన్నారు.

జమ్మలమడుగు: సరస్వతీ దేవి పుట్టిన రోజు అయిన వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సరస్వతీ దేవి చిత్రపటానికి పూజలు చేసి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అక్షరాభ్యాసం చేయించడంతోపాటు గురువులకు తాంబూలాం ఇచ్చి ఆశీర్వాదం పొందారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆవోపా ప్రతినిధులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ
- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టరు ఎం. సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఇళ్లు ఇస్తామని చెప్పి పిచ్చుక గూళ్ల మాదిరిగా టిడ్కో ఇళ్లను నిర్మించారన్నారు. అయితే వాటిని మధ్యలోనే నిలుపుదల చేశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని గుర్తించి టిడ్కో ఇళ్లను కొనసాగించి పనులు పూర్తి చేసి లబ్ధిదారుల పేర్ల మీదనే ఉచితంగా రిజిస్ట్రేషన్ పత్రాలను, ఆ ఇంటి తాళాలను కూడా అందించారన్నారు. టిడ్కో ఇళ్లు రాని వారికి నవరత్నాలలో పేదలందరికి ఇళ్లు పథకం కింద ప్రత్యేకంగా జగనన్న కాలనీలో ఇళ్లను నిర్మిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చంద్రకళ, కమిషనర్ రామక్రిష్ణలతో పాటు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టిడ్కో అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

జమ్మలమడుగు : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యేడాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 18వ వార్డులో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలిచి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగుతాయన్నారు. సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధి పొందిఉంటే వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఆయన ప్రజల వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై లబ్ధి దారులను కలిసి మాట్లాడారు. దానితో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్లు పోచిరెడ్డి, ,గౌరీనాథ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మార్సెల్‌శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడాలి

ఎర్రగుంట్ల : ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ఆడి గెలవాలని ఎమ్మెల్యే డాక్టరు సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిలంకూరు గ్రామంలో నిర్వహిస్తున్న సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు క్రీడాకారులు వారి క్రీడా ప్రతిభను కనపరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కూడా ఆడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వివరాల నమోదు తప్పనిసరి

పులివెందుల టౌన్ : సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్‌లు శుభ్రపరిచే కార్మికుల వివరాల నమోదుకు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత పొందేందుకు నమస్తే పథకంలో భాగంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకో సిస్టమ్(నమస్తే) పథకం ద్వారా కార్మికుల జీవన భద్రతతోపాటు ఉపాధి కల్పన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని మొయిళ్లచెరువు సమీపంలోని కొండపై వెలసిన తిరుమలేసుని ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు బుధవారంతో వైభవంగా ముగిశాయి. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. సమీప ప్రాంతాల నుంచి తరలి వచ్చిన విశేషంగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు నిర్వాహకులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అక్కడ నిర్వహించిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా కుంచనపల్లెకు చెందిన జస్వితరెడ్డికి చెందిన ఎద్దు అత్యధిక దూరం రాతి దూలాన్ని ఈడ్చి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే వైఎస్సార్ జిల్లా చౌటుపల్లెకు చెందిన చంద్ర ఓబుళరెడ్డి ఎద్దు ద్వితీయ స్థానంలో, వైఎస్సార్ జిల్లా బాలుగారిపల్లెకు చెందిన రమణారెడ్డి ఎద్దు తృతీయ స్థానంలో, గుంటూరు జిల్లా కుంచనపల్లెకు చెందిన తిశగ్న రెడ్డి ఎద్దు నాల్గవ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీపీ రఘునాథరెడ్డి, ఇతర నాయకులు వెంకటరెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

పోలింగ్ బూత్ పరిశీలన

చింతకొమ్మదిన్నె : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ బూతులను బుధవారం డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్‌తోపాటు చింతకొమ్మదిన్నె సీఐ శంకర్ నాయక్ పరిశీలించారు. మండలంలో సమస్యాత్మకంగా ఉన్న నాగిరెడ్డిపల్లి, చింతకొమ్మదిన్నె, జె.కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న ఎన్నికల బూతులను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.

నూతన నియామకం

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామానికి చెందిన వై.సర్వేశ్వరరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు మండల కన్వీనర్ చవ్వా క్రిష్టారెడ్డి తెలిపారు. సందర్భంగా సర్వేశ్వరరెడ్డి తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

చింతకొమ్మదిన్నె : మండల వ్యాప్తంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వేణుగోపాల్ తెలిపారు. టౌన్ టు ఫీడర్ కింద గ్రామాలైన ఊటుకూరు, ఆజాద్ నగర్, మూలవంక, చెర్లోపల్లిలో నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తుండటంతో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు.